# మహానగరం కథలు

-వేదుల సుభద్ర





## సెంటర్లో పెద్దావిడ

*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

**బెంగుళూరులో ఎం.జీ. రోడ్‌కి పక్కగా ఉన్న** ' బెంగుళూరు సెంట్రల్ ' మాల్ దగ్గర చాలా రద్దీగా ఉంది. మాల్ లోపలకీ, బయటకీ వచ్చేపోయే మనుష్యులూ, మాల్ చుట్టూ ఉన్న షాప్‌ల్లో అమ్ముతున్న రకరకాల తినుబండారాలు తింటున్న వారూ, గోడ దాటి రోడ్డు మీదకి వస్తే బస్సులూ, ఆటోలూ, కార్లూ.. వడివడిగా నడుస్తున్న వారూ.. అంతా ఒకటే కోలాహలం. శనివారం ఉదయం పదిన్నర అవుతోంది. పెద్ద ఎండ లేదు. ఉండీ ఉండీ సన్నగా చల్లగాలి వీస్తోంది.

తలవంచుకుని గబ గబా నడుస్తోంది ధరణి. సెంట్రల్ మాల్ దాటాకా, రీబాక్ షోరూం ఉంది. అక్కడ కలుస్తానన్నాడు అశోక్, బాబు మహిత్‌తో సహా... బాబుకి స్కూల్ షూ కొనాలి. వాళ్ళిద్దరూ వాడి క్రికెట్ సమ్మర్ కాంప్‌కి వెళ్ళి అటునించటే వస్తానన్నారు. పనిమనిషి వెళ్ళాకా తను ఇంటినించి బయలుదేరుతానంది. అందరూ అక్కడే కలుద్దామని ముందే అనుకున్నారు.

ఈ మధ్యన స్కూళ్ళు కూడా బాటా, కరోనా లాంటివి కాకుండా, రీబోక్, నైకి ఇలాంటి బ్రాండ్‌లే వేసుకోమంటున్నారు.. ఎందుకో మరి?దానికో డిస్కవుంట్ కూపన్‌ట. పుస్తకాలతో పాటు ఇచ్చారు.'అది పెట్టుకుందా? లేదా?' అని మరొకసారి బాగ్ తెరిచి చూసుకుంది. లేకపోతే మళ్ళీ అశోక్ తో ఉపన్యాసం. మేయో హాల్ దగ్గర బస్‌దిగి నడుస్తోంది.

ఇంతలో "అమ్మా" అని నెమ్మదిగా పిలిచినట్టనిపించింది.

సెంట్రల్ మాల్ మెయిన్ ఎంట్రన్స్ దాటుతున్న ధరణి, 'పిలిచినదెవరా?' అని తలెత్తి చూసింది.

ఎవరో పెద్దావిడ..పసుపురంగు మీద ఎర్ర చుక్కలున్న మధుర చుక్కల చీర, ఆకుపచ్చటి పాత జాకెట్, నుదిటిన పావలా కాసంత ఎర్రటి కుంకుమ బొట్టూ, చేతులకి ఎర్రటి మట్టిగాజులు.. మెళ్ళో బాగా అరిగినట్టుగా కనిపిస్తున్న పల్చటి నాను తాడు, చెవులకి కూడా ఏనాటివో అన్నట్టున్న ఎర్ర రాయి ఉన్న బంగారం దుద్దులు.. ఒకప్పుడు బాగా బతికిన కుటుంబానికి చెందినట్టుగా ఉంది

తను తలెత్తి చూసినందువల్లనేమో, కాస్తంత బెరుగ్గానే దగ్గరకి వచ్చింది ఆవిడ.

"అమ్మా, తెలుగు?.. " అని ప్రశ్నో, కాదో తెలియనంత అయోమయంగా అడిగింది. "తెలుగు వచ్చా? " అని ఆవిడ అభిప్రాయం కావచ్చు

అప్రయత్నంగానే తలూపింది ధరణి. జివ్వున వచ్చింది ముడతలు పడ్డ ఆ ముఖంలోకి వెలుగు. చేతిలోని ముక్కుపొడుం రంగు సంచీని మరింత దగ్గరగా లాక్కుంటూ అందావిడ

"అమ్మా, నేను బస్ స్టాండ్‌కి వెళ్ళాలి. కొంచం సహాయం కావాలి అంది." మాట స్వచ్ఛంగా, ఉఛ్ఛారణ వినసొంపుగా ఉంది.

ధరణి.. "అవునా!" అన్నట్టు చూసింది. కానీ ఏమీ మాట్లాడలేదు. వెంటనే ఎలా స్పందించాలో తెలియలేదు తనకి.

"మీరు కొంచం సహాయం చేస్తే.. ఊరుకాని ఊరు..నాకు ఏమీ తెలీదు"అంది ఆవిడే

"సరే.. ఆటో ఎక్కిస్తాను. వెళ్ళగలరా?" అంది. ఎప్పుడూ ఇలాంటి అనుభవం లేకపోవడంతో అంతకంటే ఏమనాలో తెలీలేదు ఆమెకి.

"కాదమ్మా, నా దగ్గర డబ్బులు తక్కువ అయ్యాయి" అంది ఆవిడ బెరుగ్గా.

"ఓ.." అని ఇంకా ఏదో అనబోయేంతలో ధరణి సెల్ ఫోన్ మోగింది. కొడుకు మహిత్..వాళ్ళ నాన్న ఫోన్ నించి..

"అమ్మా, మేమప్పుడే సగం దూరం వచ్చేశాం.. నువ్వెక్కడ?" అని అడుగుతున్నాడు.

"వచ్చేశాను. ఐ యాం ఆల్‌మోస్ట్ దేర్.." అంటూ గబ గబా ఆ పెద్దావిడని దాటి ముందుకు నడిచింది. ఆవిడ అక్కడే నిలబడిపోయింది.

ఏం చెయ్యాలో తెలియక ఆవిడని దాటుకుని వచ్చేసింది.. కానీ ధరణి మనసులో ఎన్నో భావాలు.

ఆవిడ 'డబ్బు తక్కువయింది' అనగానే రకరకాల ఆలోచనలు ధరణి మనసులో.. ఇలాంటివెన్నో వింటూ ఉంటాము, చదువుతూ ఉంటాము. ఈవిడా అలాంటిదే అయి ఉంటుంది. ఇదే ఆమెకొచ్చిన మొదటి ఆలోచన. పొరపాటున ఇస్తానంటే ఎంత కావాలంటుందో ఏమిటో?

"నా కొడుకూ, కోడలు కన్వాపరేషన్ చేయిస్తామన్నారమ్మా, మూడువేలుంటే పట్టుకుని రమ్మంటే మా ఇంటాయన వద్దన్నా వినకుండా పరిగెత్తుకొచ్చానమ్మా. రాగానే మూడేలు తీసేసుకుని నన్నిక్కడే ఉండమని వెళ్ళిపోయారు. నాలుగ్గంటలైంది. ఇంకేం వస్తారు? అందుకే నేను మా గుంటూరు వెళ్ళిపోదామని అనుకుంటన్నానమ్మా.. చూసుకుంటే రెండు వందలు తక్కువ పడింది.." అని ఇంకా చెప్తానే ఉందావిడ,తను గబ గబా ఆమెని దాటుకుని వచ్చేటప్పటికి.

' ఆవిడ చెప్పింది నిజమేనా? నిజమైతే పాపం ఎలా వెళుతుంది ఒక్కర్తీ? ' ఓ వైపు..

'ఎందరో పొద్దున్న లేస్తే ఇలాంటి అబద్ధాలు చెప్పి పొట్టపోసుకుంటారు.. ఈవిడా అలాంటిదే అయితే?' ఇంకో వైపు ! రెండు రకాలుగా ఊగిసలాడుతోంది ధరణి.

'పాపం ఆవిడని చూస్తే అలా అనిపించడం లేదు.. కళ్ళల్లో చిప్పిల్లుతున్న నీళ్ళు, అడగలేక అడుగుతున్న తీరు పాపం నిజమే చెబుతోందేమో అనిపిస్తోంది. పాపం ఎలా వదిలేసి వచ్చేసింది తను? పోనీ మళ్ళీ వెళ్ళి చూసి వస్తేనో 'ఓ వైపు..

'ఛా, ఆవిడెవరో ఏమిటో? మంచికో చెడ్డకో వదిలి వచ్చేశాను కదా..మళ్ళీ వెళ్ళి కదపడం దేనికి?' ఇంకో వైపు !

'వదిలి వచ్చేశానా?వదిలించుకోవాలని వచ్చేశానా?ఛీ, నేనేనా ఇలా చేసినది? ఒక్క క్షణం ఆవిడకేం కావాలో తెలుసుకుంటే నా సొమ్మేం పోయేది?' ఓ వైపు...

' ఏం కావాలో తెలిసేదేమిటి? తెలియకపోతేగా?' ఇంకో వైపు!

'ఏమైనా ఒక సారి వెళ్ళి చూసి వస్తే మంచిదేమో? పాపం భాష కూడా రాదు..ఒక వేళ ఎవ్వరూ సహాయం చెయ్యకపోతే ఎలా? కొడుకు రాకపోతే ఎక్కడుంటుందో పాపం? ఒకసారి వెళ్ళి చూసి రావడమే మంచిది..' ఓ వైపు...

అనుకున్న వెంటనే మళ్ళీ వెనక్కి తిరిగింది.. మనసులో ఎన్నో ఆలోచనలు.. అలాగే ద్వైదీభావంతో ఊగిసలాడుతోంది..

'అశోక్, బాబు వచ్చేస్తారేమో? ఈవిడ నిజమే చెబుతోందని గారెంటీ ఏమిటి? ఆవిడ మాట పట్టుకుని పిచ్చిదానిలా వెనక్కి కూడా వెళుతున్నానా?' పరిపరి విధాల అనుకుంటూనే తన ప్రయత్నం లేకుండానే వెనక్కి వచ్చింది.

ఆవిడ అక్కడే అలాగే సంచీని గుండెలకి దగ్గరగా పట్టుకుని నిలబడి ఉంది.

"అమ్మా, ఇప్పుడు మళ్ళీ వివరంగా చెప్పు.. నీకేం కావాలి ?" అంది ధరణి.

ఆవిడ అధాటున ధరణి చెయ్యి పట్టుకుని

"మధ్యాహ్నం రైలుందమ్మా, పెశాంతి.. దానికెల్లిపోతాను.. మా ఆయన సెప్పిన మాటినకుండా వచ్చాను చూశావా, కావలిసిందే ఇలా.. ఇలాంటి కొడుకింకెవరికీ వద్దమ్మా.."అంది ఆవేదనగా.

ధరణికి ఎంతో జాలి వేసింది.. "సరే ఇప్పుడెలా వెళతారు? దారి తెలుసా? రెండువందలు కదా కావాలి.."అంది ధరణి..

"అవునమ్మా, మూడొందలుంటుందట టిక్కెట్టు.. నాదగ్గర నూటేభయ్ ఉంది, ఎతికితే ఇంకో ఇరవై, ముప్పై ఉంటదేమో" అంది.

గబ గబ పర్స్ తీసింది. చేతికొచ్చిన నూటయాభై ఆవిడ చేతిలో పెట్టింది. మరో ముప్ఫై రూపాయలున్నాయి చిల్లర. మిగతావన్ని పెద్ద నోట్లే. పక్కనున్న ఆటోని పిలిచి.. అతనికి కన్నడలో కొద్దిగా పరిస్థితి చెప్పి అతని చేతిలో ముప్ఫై రూపాయలుంచి స్టేషన్ దాకా తీసుకెళ్ళమని చెప్పింది. ఏదో ఇరవైయో తక్కువ పడితే ఇవ్వమంది ఆవిడని.

"నీ ఎడ్రస్ ఇస్తే డబ్బులు వెళ్ళగానే పంపేస్తానమ్మా" అంటోందావిడ.

"అంత టైం లేదు.. ముందు ఆ ఆటో ఎక్కి వెళ్ళు. లేకపోతే ట్రైన్ అందదు" అని కంగారు పెట్టింది. ఆవిడ అదే నీళ్ళ కళ్ళతో ఏం మాట్లాడాలో తెలియనట్టుగా తననే చూస్తూ ఉంటే అది 'నిజమా/ నటనా? 'అని ఆలోచించేంత సాహసం చెయ్యలేకపోయింది.

'ఏదైనా పరవాలేదులే..' అనుకుందేమో మరి..ఒక్కక్షణం మనసంతా తేలిక పడిన ఫీలింగ్

ఆవిడ ఆటో వెళ్ళాకా, అప్పుడు రీబోక్ షో రూం వైపు అడుగులు వేసింది. అప్పటికే కార్ పార్క్ చేసేసి తన కోసమే చూస్తున్నారు వాళ్ళిద్దరూ.

"అమ్మా, నువ్వే లేట్" అన్నాడు మహిత్..

"కొంచం మెల్లగా నడిచాను, నీ అంత ఫాస్ట్‌గా నడవలేను కదా నేను " అంది నవ్వుతూ. వాడికివన్నీ చెప్పేవయసు కాదు.

"చాలా సేపయిందా వచ్చి?"అంది అశోక్‌తో.

"లేదు.. ఇప్పుడే! వీడలాగే అంటాడు? ఆర్ యూ ఓకే?" అనడిగాడు.

తన ముఖంలో ఏ భావమూ దాగదు.. అది వరమో, శాపమో మరి.. నవ్వింది. "చెప్తాను"అంటూ.

ముందు స్కూల్ షూస్ కొన్నారు. డిస్కవుంటు కూపన్ ఇచ్చాకా కూడా, అది ఏడువందలు పడింది. మూడో క్లాస్ పిల్లాడి రోజు వారీ షూస్! ఇంతలో అశోక్ దృష్టి కొత్తగా వచ్చిన రన్నింగ్ షూస్ మీద పడింది " నావి చిరిగిపోయాయి కదా, కొత్తవి తీసుకోనా?" అన్నాడు.

"నీకు?" అన్నాడు.

"నావి బానే ఉన్నాయి" అంది.

రెండు మూడు మోడల్స్ చూసి, వేసుకుని నడిచి.. నాలుగువేల ఎనిమిది వందలు పెట్టి షూస్ కొన్నాడు. "దీనిమీద ఏమీ సేల్ లేదా ? " అడిగాడు.

సేల్స్ అమ్మాయి "లేదు సార్.. కానీ మూడువేలు దాటిన ప్రతీ పర్చేజ్ మీద ఒక అస్యూర్డ్ గిఫ్ట్ " అని ఒక స్క్రాచ్ కార్డ్ ఇచ్చింది.

మహిత్ చాలా ఉత్సాహంగా ధరణిచ్చిన రెండు రూపాయల బిళ్ళతో బలంగా రుద్దాడు.

ఒక సిప్పర్ వచ్చింది. గట్టిగా మాట్లాడితే అరలీటర్ నీళ్ళు పడతాయేమో. కలర్ ఎంచుకోమంటే నవ్వింది ధరణి.. ఇన్నివేలు పోసి షూ కొంటే ఇదా గిఫ్ట్? ఎవరిమ్మన్నారో వీళ్ళని. ఇది తప్పకుండా చైనా నించి వచ్చినదే అనుకుంది. రెండు షూ డబ్బాలూ మోసుకుని కార్ దగ్గరకి వచ్చారో లేదో మహిత్ గొడవ.. ఆకలి..! అంటూ.

"నేను వంట చేశేశా నాన్నా, ఇంటికి వెళ్ళిపోదాం"అంది. మెక్‌డోనాల్డ్స్ అంటూ వాడు పట్టు పట్టేసరికి 'సరే' అని వాడిని తీసుకుని అందులోకి దూరారు.

వాడు తింటూంటే ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

"ఇప్పుడు చెప్పు. ఏమయింది?"అన్నాడు అశోక్ నవ్వుతూ.

క్లుప్తంగానే అయినా ముఖ్యమైన వివరాలు మిస్ కాకుండా అతనికి విషయం వివరించింది..

అలా చెప్తూనే "నేనింకా ఇప్పటికీ ఆవిడని మర్చిపోలేకపోతున్నాను. ఆవిడకి అబద్ధం చెప్పాల్సిన అవసరం కనిపించలేదు. అని నాకెందుకో అనిపించింది. కానీ అలా అని నమ్మవచ్చా, లేదా? అని కూడా నా మనసులో ఏదో ఒక మూల అనుమానం." స్వత హాగా సున్నిత మనస్కురాలు ఆమె. అందుకే అశోక్ ఆమెని నొప్పించే మాట ఏమీ అనలేదు.

"పరవాలేదులే. నీకు ఆ టైముకి ఏది రైటనిపించిందో అది చేశావు. అంతే కదా.. వదిలెయ్" అన్నాడు. మహిత్ తినడం పూర్తి అవడంతో అందరూ బయలుదేరారు.

దారిలో ఒకటి రెండు సార్లు అతనితో " ఆవిడ ఈపాటికి నిజంగానే ట్రైన్ ఎక్కి ఉంటుందా? "అని అడుగుతుంటే అతను విసుగ్గా..

" నీతో ఇదే చిక్కు. ఏదీ ఒక పట్టాన మర్చిపోవు కద. లీవ్ ఇట్."అన్నాడు.

కానీ ధరణి వదలలేకపోయింది..పైకి అనలేదు కానీ.. రాత్రంతా కూడా ఆవిడ చాలాసేపు గుర్తొస్తూనే ఉంది ధరణికి.

మర్నాడు ఆఫీసులకి మామూలుగానే వెళ్ళారు. లంచ్ టైములో కలిసారు ధరణీ, ఆమె స్నేహితులూ.

హరిత, ధరణి, చందన, విజయ గత ఆరేళ్ళుగా ఇదే కంపెనీలో పనిచేస్తున్నారు. బాగా స్నేహం వారికి. ప్రాజెక్ట్లు మారినా వారి స్నేహం చెక్కు చెదరలేదు.

"ఎవరిని నమ్మాలో, నమ్మకూడదో కూడా తెలియడం లేదు ఈ రోజుల్లో?"అంది ధరణి ఉపోద్ఘాతం లేకుండా.

"అదేమిటి? ఏమయింది?" అంది చందన.

నిన్న జరిగిన సంఘటనని వివరంగా చెప్పింది, అలాగే అశోక్ రియాక్షన్ గురించి కూడా.

అది విన్న విజయ పక పకా నవ్వింది.

"ఎందుకే నవ్వుతున్నావ్?"అంది ధరణి కోపంగా.

"నవ్వక ఏం చెయ్యమంటావ్? ఇంకా నీలాంటివాళ్ళుండబట్టే అలాంటివారి ఆటలు సాగుతున్నాయి. లేకపోతే ఆవిడ కొడుకు రమ్మన్నాడుట, ఈవిడ వచ్చిందిట. వాడిక్కడవిడనొదిలేసి పారిపోయాడా?ఎలా నమ్మావే ఇవన్నీ? ఎంతమందిని చూడలేదు ఇలా? పర్స్ పోయిందని, పెట్టె పోయిందనీ.. ఐదు వందలివ్వమనీ, వెళ్ళగానే పంపేస్తామనీ.. నేనే ఎన్నో సార్లు చూశాను. వాళ్ళ ఊర్లలో ఇవన్నీ సాగవు. ఈ మహానగరాలలో రోజుకోమూలని టార్గెట్ చేసుకున్నా సంవత్సరాలు హాయిగా గడిచిపోతాయి. అదే ట్రిక్ అంది " అంది విజయ నవ్వుతూ.

విజయ తత్వమే అంత, ఎదుటివారు ఏమైనా అనుకుంటారేమో అన్న ఆలోచన ఆమెకి తక్కువ.

ధరణి దెబ్బ తిన్నట్టు చూసింది.

"అంతేనంటావా? నాకు కూడా చాలా అనిపించింది. కానీ ఆవిడ ముఖం చూస్తే ఎందుకో ఆవిడ అబద్ధం చెప్పదేమో అనిపించింది తెలుసా?" అంది.

"అవునులే.. ఆవిడ పాపం సత్యహరిశ్చ్రుడికి స్వయానా అక్కగారు కదా మరి.. అబద్ధం చెప్పనే చెప్పదు." అంది ధరణిని ఆట పట్టిస్తూ.

"ఊరుకో విజా.. అది అసలే బాధపడుతూంటే. పోనీలే ధరణీ..! రెండువందలేకదా ఇచ్చావు. మరీ ఎక్కువ కాదుగా. " అంది హరిత అనునయంగా.

"నా బాధ డబ్బు గురించి కాదు హరీ.. మహా అయితే ఒకరోజు మన బ్రేక్ ఫాస్ట్ ఖర్చు. లేదా ఒకరోజు నా ఆటో ఖర్చు. అది కాదు. నేనాలోచించేది. ఆవిడ నిజం చెప్పిందా? లేదా? నిజమే ఐతే సరిగ్గా ఇంటికి వెళ్ళిందా లేదా అని. నిజం చెప్పి ఇంటికివెళ్ళి ఉంటే పర్వాలేదు. లేకపోతే అలాంటావిడ కూడా మోసం చేస్తుందా? ఇంక ఇలా అయితే మనుషుల్ని నమ్మగలమా ?అసలు అని నేను బాధ పడుతున్నాను." అంది.

"అవునవును.. పోనీ సరదాగా గుంటూరు వెళ్ళి చూసివద్దామా ఆవిడ సరిగ్గా వెళ్ళిందో లేదో?అని" నవ్వింది విజయ..

"మనకి తెలిసి మోసం జరిగే చోట, జరగని చోటా మనకేమీ ఇబ్బంది లేదేమో, తెలిసీ తెలియని చోటే కష్టమా?" అంది చందన సడన్‌గా.

"అంటే?" అడిగారు ముగ్గురూ.

"అంటే మరేమీ లేదు.. ఎక్కడైనా మనం మోసపోవడానికి ప్రిపేర్ అయి ఉంటే అక్కడ మోసం జరిగినా పరవాలేదనే కదా మనం అనుకునేది" అంది.

"నీ మొహం.. కొంచం అర్ధం అయ్యేలా మాట్లాడు. పొద్దున్నే ఏం తిన్నావు?"అంది విజయ నవ్వుతూ..

"రోజూ తినే కేంటీన్ఇడ్లీనే కాని.. ఇందులో అర్ధం కాకపోవడానికేమీ లేదు. "

ఫలానా చోట, లేదా ఫలానా వారు మోసం చేసే ఆస్కారం ఉంది అని మనకి తెలిసినప్పుడో, అనుభవంలోకి వచ్చినప్పుడో మనకి ఒకవేళ నిజంగా మోసం జరిగినా పెద్ద బాధగా అనిపించదు కదా, కానీ మనం అనుకోని చోట మోసానికి తావుందేమో అన్న ఆలోచనే చిరాగ్గా ఉంటుంది కదా, ప్రస్తుతం అదే ధరణి ప్రోబ్లెం..

"దానికి డబ్బు గురించిబాధ నిన్నుందేమో కానీ, ఈ రోజు లేదు. కానీ ఆవిడ నిజం చెప్పి ఉంటుంది అనుకుంటే దానికి హాయిగా ఉంది. అబద్ధం చెప్పి ఉండవచ్చు అన్న ఊహే భరించలేకపోతోంది దానికి కారణం.. ఇమేజ్, చూడగానే, పెద్ద కారణాల్లేకుండానే మనుష్యుల మీద మనం ఏర్పరుచుకునే అభిప్రాయాలు.." అంది నవ్వుతూ.

"అంటే తప్పంతా ధరణిదేనా?" నిష్టూరంగా అడిగింది విజయ.

"నిస్సందేహంగా! ఇవ్వడం తప్పు కాదు, తను ఇచ్చింది కదా, ఆవిడ నిజంగా మంచిదవ్వాలనుకోవడం తప్పు. ఆవిడ ఎలాంటిదైనా కావచ్చు.. కొడుకు అనేవాడు నిజంగా ఉంటే ఈవిడచేత ఈ నాటకం ఆడిస్తూ ఉండవచ్చు. నిజంగానే వదిలేసి పోయి ఉండవచ్చు, అసలు ఈవిడే ఓ నాలుగు భాషలు నేర్చుకుని నలుగురిని రోజుకి ఇలాంటి కథలతో బురిడీ కొట్టిస్తూ ఉండవచ్చు. ఏమైనా అయి ఉండవచ్చు. దేనికీ గేరంటీ లేదు.." అంది చందన.

"నువ్వు మరీ దారుణంగా మాట్లాడుతున్నావు.. చందూ!"అంది హరిత.

"లేదు హరీ, ప్రాక్టికల్‌గా మాట్లాడుతున్నాను. మనుషులు ఇలాంటివారు అని మనం ఏర్పరుచుకున్న అభిప్రాయాలు, పర్సెప్షన్స్‌కి వాళ్ళెంతవరకూ బాధ్యులు.. చెప్పు? ఒక వ్యక్తి గురించి మనకేమీ తెలియకుండానే అతనో, ఆవిడో చాలా మంచివారని అనుకోవడం, మన అంచనాకి కాస్త భిన్నంగా జరిగినా బాధపడడం.. ఇదంతా అవసరమా? అనుకోకుండా జరిగిన ఒక పనికింత వాదనా, ఆలోచనా కావాలా?"

"నేను రోజూ పొద్దున్నే ఆటోలో వస్తాను ఆఫీసుకి. ఆటో వాళ్ళు రోజూ ఇంచుమించుగా ఒకేమాట. మీ ఆఫీస్ ఊరి చివరెక్కడో ఉంది.. అక్కడనించి ఖాళీగా రావాలి. మీటర్ మీద ఇరవై రూపాయలెక్కువ ఇవాలంటారు.. ఇక్కడ నాకున్నవి రెండే మార్గాలు.. మొదటిది వద్దని, వేరే బస్సో, మరొకటో ఎక్కి రావడం, రెండోది మాట్లాడకుండా వాళ్ళు చెప్పినట్టు వినడం. ఇరవై రూపాయలంటే ఇంచుమించు సగం ఫేర్ ఎక్కువ ఇస్తున్నాను. కానీ నాకేమీ బాధ అనిపించదు. ఎందుకంటే అలవాటు అయిపోయిందేమో. లేదా నా పని

అవ్వడం నాకు ముఖ్యం. అన్నింటికంటే ముఖ్యం ఆటోవాళ్ళందరూ ఇంతే అని నాకు బలపడుతున్న అభిప్రాయం. దానివల్ల ఎప్పుడైనా ఒకతను ఇరవై రూపాయలు ఎక్కువ అడగకపోతే నాకు చాలా రిలీఫ్‌గా ఉంటుంది ఇంకా న్యాయంగా వచ్చేవాళ్ళున్నారన్న ఆనందంతో. అంతే కాని మిగతావారందరూ రాక్షసులన్న భావన నాకెప్పుడూ కలగలేదు.

ఇంకోటి చెప్తాను. మా అక్క కొడుకు హేరీ పోటర్ పుస్తకాలు కావాలన్నాడని గంగారాంస్‌కి వెళ్ళాను. అన్నీ ఒకేసారి చదవలేడు కదా అని నాలుగు పుస్తకాలు తీసుకున్నాను, పదిహేనువందలపైన అయింది బిల్. మెట్లు దిగి కిందకి వచ్చానో లేదో ఎదురుగా పేవ్‌మెంట్ మీద అవే పుస్తకాలు ఒక్కొక్కటి వందకి అమ్మేస్తున్నారు. నేను నాలుగు పుస్తకాలకి పెట్టిన ధరలో సగం పెడితే మొత్తం అన్నీ కొనేసుకోవచ్చు. ఎంత మోసపోయినట్టుగా అనిపించిందో తెలుసా? ఎందుకంటే అది నేను అస్సలు ఎక్స్‌పెక్ట్ చెయ్యలేదు..అలా అని దాని గురించి నాకు తెలీదని కాదు ఇలా పొద్దున్న లేస్తే ఎన్నో! అందుకే అన్నాను తెలిసిన చోట చేస్తే పెద్ద కష్టం అనిపించదు అని..

చాలా ఏళ్ళ క్రితం అమ్మ మా పక్కింటి ఆంటీకి బాగా ఎన్నో ఏళ్ళుగా తెలుసున్న కంసాలి అని అతని ద్వారా గాజుల జత చేయించుకుంది. మరో అనుమానానికి తావు లేకుండా అతనడిగినవన్నీ ఇచ్చి నగ ఇంటికి తెచ్చుకున్న మూడోనెలకే గాజు లోపల భాగం అరిగి రాగి బయటపడేసరికి. అమ్మ గుండెల్లో రాయిపడింది. వెంటనే ఆ ఆంటీ దగ్గరకి వెళ్ళి కంసాలితో పెద్ద గొడవ పెట్టుకుని మళ్ళీ ఇంకో జత గాజులు చేయించుకుంది. కానీ అప్పటినుండీ మేమే కాదు, ఆవిడ కూడా అతని దగ్గర మళ్ళీ నగలు చేయించుకోలేదు. అసలా మోసం ఎలా, ఎందుకు జరిగిందో ఇప్పటివరకూ తెలియలేదు. అది మర్చిపోవడానికి మా కంటే ఎక్కువ ఆంటీకి చాలా కాలం పట్టింది. మాకేదో తనే అన్యాయం చేసినట్టు ఫీల్ అయ్యేది. ఎన్నోసార్లు అమ్మని విషయం గురించి అడిగి బాధపడేది. కారణం.. ఆవిడ అతనలా చేస్తాడని ఊహించలేకపోవడమే!

పిల్లల పెళ్ళిళ్ళతో సహా తన పనులన్నీ కలిసి ఉండగా చేసుకుని, మేము పెద్దవాళ్ళమయేసరికి ఆస్థులు పంచేసుకుందామని మా పెదనాన్న అంటే ఆ రోజు మా నాన్నకి హార్ట్ ఎటాక్ వచ్చింది. అది మేమెవ్వరమూ జీవితంలో మరిచిపోలేని షాక్.

ఇన్ని ఉదాహరణలెందుకిచ్చానో తెలుసా? చిన్నదవనీ, పెద్దదవనీ, మనం ఊహించిన/ఊహించగలిగిన మోసం మరీ భయంకరంగా కనిపించదు. ఇప్పుడర్థం అయిందా నేనన్న మాటలకి అర్థం!?" అంది నవ్వుతూ.

" కానీ..!?" విజయ ఏదో అనబోతుంటే అంది ధరణి " నాకర్థం అయింది. ఆవిడ మంచిది.. ఈ పాటికి గుంటూరు వెళ్ళిపోయి ఉంటుంది.. ఇందులో మోసానికి తావే లేదు, ఇలా అనుకుంటే నా మనసుకెంతో హాయిగా ఉంది" అని.

"మళ్ళీ మొదటికొచ్చింది, మళ్ళీ టోపీ వేస్తారు దీనికెవరో, చూస్తూఉండండి" అని విజయ విసుగ్గా అంటుంటే అందరూ నవ్వేశారు.

Click here to share your comments on this story